

# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!






# కరెంటు ఉండాలంటే 'కారు' రావాలె..

## మళ్లీ నాటి చీకటి రోజులు వద్దంటున్న రైతులు



- 'మూడు గంటల' కాంగ్రెస్ వద్దు
- 24 గంటల కరెంటిచ్చే బీఆర్ఎస్సే ముద్దు
- 3 గంటల కరెంటుతో.. గుంట తడవదు.. పంట పండదు
- 10 హెచ్‌పీ మోటర్లను మా నెత్తిన పెట్టొద్దు
- పెట్టుబడీ రాదని రైతుల ఆవేదన
- కాంగ్రెస్ పాలన రానివ్వొద్దని స్పష్టం చేస్తున్న అన్నదాతలు

ధరణి

### కాంగ్రెస్ వస్తే సమస్యలొస్తయ్..



బోధన్ రూరల్: సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత కరెంట్ కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి. గత కాంగ్రెస్ హయాంలో రాత్రింబవళ్లూ కరెంట్ కష్టాలతో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు 24 గంటలపాటు ఉచితంగా కరెంటును సరఫరా చేయడంతో రంది లేకుండా పంటలు పండిస్తున్నాం. సీఎం కేసీఆర్ మేలును రైతులు ఎప్పటికీ మరువరు.

**-టిక్యానాయక్, ఊట్‌పల్లి, బోధన్ మండలం**

### కాంగ్రెస్ పార్టీకి రైతుల కష్టం తెల్వదు..



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిను రద్దు చేస్తామంటున్నారు. రైతుల కష్టం తెలియకుండా కాంగ్రెస్ వాళ్లు ఏదేదో మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముడు గంటలే కరెంట్ ఇస్తామంటున్నారు. ధరణి రద్దు చేస్తామంటున్నారు. ధరణిని రద్దు చేస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటలపాటు ఉచితంగా కరెంట్ ఇస్తున్నాడు. రైతుబంధు ఇస్తున్నాడు. రైతులు మరణిస్తే రూ.5 లక్షల బీమా ఇస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం మోటర్ దగ్గర కావాలి కాయాల్సిన రోజులు ఉండేవి. సీఎం కేసీఆర్ 24 కరెంట్ ఇచ్చి రైతులను ఆదుకుంటున్నడు.

**-కే. శంకర్, రాజీవ్‌నగర్ తండా, బోధన్ మండలం**

### కరెంట్ కష్టాలు పోయినయ్..



సీఎం కేసీఆర్ పాలనలో కరెంట్ కష్టాలు పోయినాయి. గత కాంగ్రెస్ హయాంలో ఎప్పుడుపడితే అప్పుడు కరెంట్ పోయేది. వస్తదో.. రాదో తెలిసేది కాదు. పాలకుల నిర్లక్ష్యంతో ఎంతో మంది రైతులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. రాత్రి సమయంలో కరెంట్ షాక్‌తో చనిపోయారు. ముడు గంటల కరెంట్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి అంటున్నాడు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అవే కరెంట్ కష్టాలు వస్తాయి. మేం సంతోషంగా ఉండాలంటే సీఎం కేసీఆర్ సార్‌ను మళ్లీ గెలిపిస్తాం.

**-సుదర్శన్‌రెడ్డి, రాంపూర్ గ్రామం, బోధన్ మండలం**

### 24 గంటల కరెంట్‌తో పంటలు బాగా పండుతున్నాయి..



కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయ్యాక వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నాడు. పంటలకు నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. 24 గంటల కరెంట్‌తో మోటర్లు కాలిపోతలేవు. కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు.. వ్యవసాయానికి ముడు గంటల కరెంట్ సరిపోతుందని. ముడు గంటల కరెంట్‌తో ఒక్క గుంటకూడా పండది. సగం ఎండిపోవుడే ఉంటది. మళ్లీ పాత పాలన అంటే ..మాకు చీకటి రోజులే. బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి.

**-బైరాగి అశోక్, పెగడాపల్లి, బోధన్ మండలం**

### ముడు గంటలు వద్దు.. 24 గంటలు కావాలి



కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి ముడు గంటల కరెంటు సరిపోతుందని చెబుతున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24 కరెంట్ ఇచ్చి ఆదుకుంటున్నది. ముడు గంటల కరెంట్ ఇస్తే పంటలు ఎండిపోతాయి. రైతులు గోసపడతారు. 24 గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్ సారే మళ్లీ సీఎం కావాలి. కాంగ్రెస్ మాయమాటలను నమ్మవద్దు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే నట్టేట మునిగిపోతం.

**-మేడి రవి పెగడాపల్లి, బోధన్ మండలం**

### 3 గంటల కరెంట్‌తో ముప్పు తిప్పలే



ధర్పల్లి: మూడు గంటల కరెంట్ సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడడం చూస్తే వారికి వ్యవసాయంపై అవగాహన లేదని తెలుస్తున్నది. ఇది ఆయన తెలివితక్కువ తనానికి నిదర్శనం. వ్యవసాయానికి 3 గంటల సమయమనేది ఎలా సరిపోతుంది. వాళ్ల పాలన వస్తే ఇక ముప్పు తిప్పలే. ఇటు పండదు.. అటు ఎండదన్నట్లు వ్యవసాయం పరిస్థితి మారుతుంది. ఇంత ఘోరంగా మాట్లాడుతున్న కాంగ్రెస్‌కు తప్పకుండా బుద్ధి చెబుతాం.

**-పీసు గోపాల్‌రాజ్, రైతు, ధర్పల్లి**

### ధరణి తీసేస్తే దళారుల రాజ్యమే



రైతులు దళారుల బారిన పడి ఇబ్బందులు పాలవ్వకూడదనే దశాబ్దాల దారిద్ర్యాన్ని వదిలించేలా కేసీఆర్ ధరణిని తీసుకవచ్చారు. ధరణితో దళారులే కాదు.. మన భూములు, రికార్డులను అధికారులు కూడా ముట్టుకోలేని పరిస్థితిలో భద్రంగా ఉన్నాయి. పట్వారీ వ్యవస్థలో ఒకరి భూమిని మకరికి మార్చడం, భూమిని తగ్గించడం, ఇష్టానుసారంగా వ్యవహరించడం ఉండేది. ధరణి వచ్చి భూముల వివరాలన్ని ఆన్‌లైన్ కావడంతో భూమికి సంబంధించి ఎలాంటి చిన్నమార్పులు చేయాలన్నా యజమాని వేలిముద్ర లేనిదే వీలు కాదు. ఇంత మంచి ధరణి పోర్టల్‌ను తీస్తామనడం దుర్మార్గం.

**-నల్ల హన్మంత్‌రెడ్డి, ధర్పల్లి**

### ధరణితో రైతులకు చాలా మేలు



గతంలో భూములు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వచ్చేది. దళారులు చెప్పినంత ఖర్చు భరించి పని చేయించుకోవాల్సి ఉంటుండె. తెలంగాణ ప్రభుత్వం ధరణి తీసుకరావడంతో రైతులకు చాలా తిప్పలు తప్పాయి. భూమి కొనుగోలు చేసిన వెంటనే అధికారులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పాస్‌బుక్‌లో భూమి వివరాలను ఎక్కిస్తున్నారు. భూములు అమ్మడం, కొనడంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. రూపాయి కూడా ఖర్చు కావడంలేదు.

**-విక్రమ్‌రెడ్డి, రైతు, మైలారం , ధర్పల్లి మండలం**

### కరెంటు కటకటలు వద్దు..



అప్పటి కరెంట్ కటకటలు మళ్లీ రావద్దు. రాత్రి పూట బావుల వద్ద పండుకునేటోళ్లం. కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వకుండె. కరెంటు కోసం పొలం కాడనే కావలి కాసేటోళ్లం. రాత్రిపూట ఇచ్చే కరెంట్‌తో చాలా మంది రైతులు నీళ్లు పెట్టేందుకు పోయి కరెంట్ షాక్‌తో, పాముల కాటుతో చనిపోయారు. కరెంట్ సరిగా రాక పంటలు ఎండిపోయేవి. తెలంగాణలో ఇప్పుడు 24 గంటల కరెంట్ వస్తుండటంతో ఎవుసం సక్కగా ఉంది. రైతులకు వీలైనప్పుడల్లా నీళ్లు పారించుకుంటున్నారు. రెండు పంటలు పండిస్తూ రాజులాగ జీవిస్తుండు. పుట్ల కొద్ది వడ్లు పండుతున్నయ్. ఆ కరెంటు కష్టాలు మళ్లీ రావొద్దు.

**-కె. నవీన్‌రెడ్డి, రామడ్గు, ధర్పల్లి మండలం**

### ఇప్పుడే రైతులు సుఖంగా ఉన్నరు



సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంటుతో రైతులు ఉన్నకాడికి సుఖంగా ఉన్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు లేవు. ఆడుతూ పాడుతూ వ్యవసాయం చేస్తున్నారు. నీళ్లు పారిచ్చేందుకు తెల్లందాక బాయిలకాడికి, బోర్లకాడికి పోవుడు తప్పింది. 24 గంటల కరెంట్‌ను 3 గంటలకు తగ్గిస్తే గొడ్డు, గోదకు కూడా గడ్డి పెంచే పరిస్థితి ఉండదు. పదేండ్ల కింద పోయిన కరెంట్ బాధలను మళ్లా తీసుకొస్తామంటున్న పార్టీలను రైతులు ఆదరించవు.

**-పీసు రాజ్‌పాల్‌రెడ్డి, ధర్పల్లి**

### భూములను గుంజుకునడానికే కాంగ్రెస్ కుట్ర



సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో ఎంతో మేలు జరుగుతున్నది. దాన్ని తీసేస్తామని కాంగ్రెసోళ్లు చెబుతున్నరు. గరీబ్ రైతుల దగ్గర నుంచి ఉన్న భూములను గుంజుకునడానికే వాళ్లు కుట్రలు చేస్తున్నరు. పటేల్, పట్వారీలను తీసుకువస్తే రైతులకు అరిగోసనే. రైతు వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీని తరిమికొడితేనే మంచిగుంటది. మళ్లీ పాత పాటే అంటే మేం ఒప్పుకోం. తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి అరగంటలోనే మా భూమిని రిజిస్ట్రేషన్ చేసింది. మూడు ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చింది. రైతుబంధు వస్తున్నది. పెట్టుబడి సాయంతోని అప్పులు లేకుంటా ఎరువులు కొంటున్నం. గీ ప్రభుత్వమే మళ్లీ రావాలి.

**-దరావత్ గోపాల్‌నాయక్, రైతు, భగవాన్ల తండా, ధర్పలి మండలం..**

### 3 గంటల కరెంట్‌తో గడ్డి కూడా పెరగదు..



మూడు గంటల కరెంటు ఇస్తే పంటలు ఎండిపోవడం ఖాయం. ఆ కొంచెసేపు నీళ్లు పారిస్తే.. గడ్డి కూడా పెరగదు. రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే చాలా ఖర్చు చేయాల్సి వస్తుంది. కాంగ్రెసోళ్లు అన్నట్లు వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ ఇవ్వడమనేది పనికిరాని మాట. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటే కరెక్ట్. రైతులు ఉన్న మోటర్లతోనే నిరంతరం పంటలకు నీళ్లు పారించుకుంటున్నరు. ప్రస్తుత కరెంట్‌తో రైతులకు ఎలాంటి బాధలు లేవు.

**-నాగంపేట్ సాయారెడ్డి, రైతు, ధర్పల్లి మండలం**

### కరెంటియ్యని కాంగ్రెస్‌ను బొందపెట్టాలె..



కాంగ్రెస్ నాయకులు నమ్మితే కష్టాలు తప్పవు. మూడు గంటల కరెంట్ వ్యవసాయానికి ఎటూ సరిపోదు. రైతుల బతుకుల్లో అంధకారమే. సీఎం కేసీఆర్ అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో గుంట భూమి కూడా ఎండిపోకుండా పంటలు బాగా పండుతున్నాయి. రైతులు మంచి లాభాల్లో ఉన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు చాలా అవస్థలు పడ్డారు. అప్పట్లో ఎన్నోసార్లు కరెంట్ కోసం సబ్‌స్టేషన్లను ముట్టడించాం. వచ్చీరాని కరెంట్‌తో మోటర్లు కాలిపోయేవి. రిపేర్ చేయించడంతో రైతులపై ఆర్థిక భారం పడేది. నీరు అందక పంటలు ఎండిపోయేవి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. 24 గంటల కరెంట్ ఉండడంతో ఏ సమయంలోనైనా పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నారు. రైతులు ఆలోచించి ఓటెయ్యాలె. కరెంట్ 3 గంటలు ఇస్తమన్న కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలి.

**-కోతి శేఖర్‌రెడ్డి, రైతు, దుబ్బాక, ధర్పల్లి మండలం**